క్లుప్తంగా

ఘనంగా అశ్వత్థ నారాయణ స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తల్లాడ: తల్లాడలోని కొత్తగూడెం రోడ్డులో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అశ్వత్థ నారాయణ స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో కల్యాణ తంతు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎస్సై అశోక్‌కుమార్

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని వెంగళరావునగర్‌లో యూత్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై అశోక్‌కుమార్ శనివారం ప్రారంభించారు. యువత సమాజహితానికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు జానిభాషా, సెక్రటరీ చాంద్‌పాషా, అన్వష, ఫజల్‌బాబు, మహేంద్రభాషా, రహీం, జాకీర్, మైబు, బాజి, అహ్మద్, రాము, ఆసిఫ్ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ఏన్కూరు: ఈ నెల 8న ఖమ్మంలో కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం జిల్లా నాయకుడు ఎస్‌కే.లాల్‌మియా కోరారు. శనివారం మండలంలోని రాజలింగాలలో నిర్వహించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, పుల్లయ్య, రమేష్, లక్ష్మీనారాయణ, లింగయ్య, ప్రభాకర్, తిరుమలరావు పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీల విజేతకు సన్మానం



చంద్రకళను సన్మానిస్తున్న స్నేహితులు

మధిర: ఇటీవల మైసూర్ దత్తపీఠం వారు నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో విజేతగా నిలిచిన అమరా చంద్రకళను మధిర పట్టణంలో శనివారం ఆమె స్నేహితులు సన్మానించారు. భగవద్గీత కంఠస్థ సపోర్టేల్లో బంగారు పతకం సాధించిన చంద్రకళను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె స్నేహితులు లగడపాటి రాధ, ఉట్ల సత్యావతి తదితరులు మాట్లాడుతూ... తమతో కలిసి ఉండే చంద్రకళ భగవద్గీత కంఠస్థ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించడం తమకు గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో కూరపాటి సీతా మహాలక్ష్మి, మాధవరపు గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చాంపియన్ బుక్‌ఆఫ్ రికార్డ్స్ ప్రదానం



విద్యార్థులకు రికార్డ్స్‌ను అందిస్తున్న దృశ్యం

సత్తుపల్లి: చదువుతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించటం అభినందనీయమని 15వ బెటాలియన్ కమాండెంట్ పెద్దబాబు, అసిస్టెంట్ కమాండెంట్ రంగారెడ్డి అన్నారు. సత్తుపల్లి విశ్వశాంతి విద్యాలయంలో శనివారం 110మంది విద్యార్థులు.. విజ్ఞానశాస్త్ర అంశాలను ప్రధానంగా తీసుకొని డూ సంథింగ్ గ్రేట్ పేరిట ప్రదర్శించిన అంశాలను చాంపియన్ బుక్‌ఆఫ్ రికార్డ్స్ సంస్థ గుర్తింపు పొందాయి. ఈ సందర్భంగా సంస్థ నుంచి ప్రతిభా గుర్తింపు పత్రాలను అధికారులు 110మంది విద్యార్థులకు అందించారు. వేమనశతకం, భగవద్గీత, చేతిరాత, ప్రముఖ దినాలు తదితర అంశాలపై అవగాహన కల్పించటం పట్ల ప్రశంసనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్ఐ, ఆర్ఐ సాయిబాబా, పాఠశాల నిర్వాహకులు పి.నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడులు బాగయ్యేనా..?



వర్షపు నీరు నిలిచిన కమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ (ఫైల్)

- అసౌకర్యాల నడుమ విద్యార్థుల చదువులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ముదిగొండ: మండలంలోని 35 ప్రాథమిక పాఠశాలలు, 3 యూపీఎస్‌లు, 15జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రభుత్వ ఉన్నతపాఠశాల, న్యూలక్ష్మీపురంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల, వల్లబిలోని గిరిజనుల ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 3,366 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. గత మూడేళ్ల క్రితం నుంచి పోలిస్తే ఐదు వేలకు పైగా ఉండాల్సిన విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గింది.

శిథిలావస్థకు చేరిన పాఠశాలలు..

మాదాపురం, పెద్దమండవ, వల్లబి, పమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులున్నా సరిపోవడం లేదు. దీంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలోని చెట్లకిందే విద్యనభ్యసిస్తున్నారు. కమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. బాణాపురం ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగానే ఉన్నాయి.

పీఈటీలు లేని పాఠశాలలు..

ముదిగొండ మండలంలోని కమలాపురం, న్యూలక్ష్మీపురం, చిరుమర్రి, యడవల్లి, గంధసిరి, పంద్రేగుపల్లి పాఠశాలల్లోని విద్యార్థులకు క్రీడలు ఆడించేవారే లేరు. దీంతో పాటు మండలంలోని 24మంది ఉపాధ్యాయులు భర్తీ కావాల్సి ఉంది. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో 259మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. కాగా ప్రతి రోజు ఏదో ఒక పాఠశాలలో ఒకరిద్దరు సెలవులపై వెళ్తున్నారు. వీరితో పాటుగా పాఠశాలకు డుమ్మా కొట్టే విద్యార్థులు కూడా వందల్లోనే ఉంటున్నారు. విద్యావ్యవస్థ గాడిన పడే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఇక్కడే స్పష్టంగా అర్థమౌంతుంది. దీంతో ప్రతి పాఠశాలలో ఉన్నత చదువుల కోసం పాకులాడే విద్యార్థులకు గ్రాఫ్ పడిపోతుందని వాపోతున్నారు. నూరు శాతం ఫలితాలు ఏ పాఠశాలలకు రావడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

అసౌకర్యాల నడుమ చదువులు..

చాలా పాఠశాలల్లో గదుల కొరత, ఆవరణలు సరిగా లేక, లోతట్టుగా ఉండడం వలన వర్షాలకు మునిగిపోతున్నాయి. అలా జరిగిందంటే చాలు ఆరోజు స్కూల్‌కి సెలవు ప్రకటించాల్సిందే. విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి క్రీడా మైదానాలు లేక ఆటలకు దూరంగా ఉంటున్నారు. ప్రతీ ఏటా కమలాపురం, న్యూలక్ష్మీపురం, వల్లబి, యడవల్లి, వివిధ పాఠశాలల్లో ఆవరణాలు వర్షాలకు మునిగి చెరువును తలపిస్తున్నాయి. కమలాపురంలో భట్టి పర్యటిస్తున్న సమయంలో గ్రామస్తులు సమస్యను విన్నవించగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. అయినా స్కూళ్ల ఆవరణలో మట్టిని మాత్రం నింపలేదు.

పట్టించుకోని అధికారులు..

విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు తీర్చాల్సి ఉన్నా.. కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి. దీంతో విద్యార్థుల సంఖ్యతో పాటు ఉత్తీర్ణత శాతం తగ్గిపోతుందని వాపోతున్నారు. ప్రైవేట్ పాఠశాలలపై ఉన్న మక్కువ ప్రభుత్వ పాఠశాలలపై చూపడం లేదని విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న పాఠశాలల గదులను తొలగించి అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



ప్రతి పాఠశాలకు ఏదో ఒక సమస్య ఉన్న మాట వాస్తవం. ఉపాధ్యాయులు వారి అత్యవసరాలను బట్టి సెలవులు పెడుతున్నారు. విద్యార్థులు రక రకాల కారణాలతో పాఠశాలకు రావడంలేదు. క్లస్టర్ వారిగా పర్యవేక్షిస్తాం, సమస్యలు మా దృష్టికి వస్తే వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– రమణయ్య, ఎంఈఓ, ముదిగొండ

వర్షాలకు నీటితో నిండి ఉంటుంది..



ప్రతి ఏటా వర్షాలకు పాఠశాల గ్రౌండ్ నీటితో నిండి ఉండడం వలన విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంటుంది. దీంతో పెద్ద వర్షాలకు సెలవు ప్రకటించాల్సి వస్తోంది. ఆవరణలో నీరు లేకుండా బయటకు వెళ్లే విధంగా మరమ్మతులు చేయిస్తే కొంత సమస్య తీరుతుంది.

– ఖాదర్‌శ్రీను, హెచ్‌ఎం, కమలాపురం

రూ.90లక్షలతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డీఈఈలు రాములు, పవార్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్‌మెంట్ స్కీమ్ (ఐపీడీఎస్) సబ్‌స్టేషన్‌లో రూ.90లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన 5మెగా వోల్ట్ యాంప్స్ అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ డీఈఈలు ఎల్.రాములు, జేవీ.పవార్ శనివారం రాత్రి ప్రారంభించారు. భారీ క్రేన్ల సహాయంతో ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. సత్తుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తులు చేపట్టేటప్పుడు విద్యుత్ అంతరాయాలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా ఈ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈలు ప్రసాద్, రాందాస్, బాలాజీ, ఏఈలు శరత్‌బాబు, భోజ్యా, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కిష్టాపురంలో మహా కుంభాభిషేకం



మంత్రి తుమ్మలకు సీతారామచంద్రస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: మండలంలోని కిష్టారం శ్రీకోదండ రామాలయం 60వ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో ఆలయ శిఖరంకు పంచవింశతి మహాకుంభాభిషేకం, అవభృదం శ్రీచక్రస్నానం కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని విశేష పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మట్టా రాగమయి.. మంత్రి తుమ్మలకు శ్రీసీతారామచంద్రస్వామి చిత్రపటాలను బహూకరించారు. కార్యక్రమంలో శేషగిరిరావు, అప్పారావు, నాగేశ్వరరావు, రవి, అప్పారావు భక్తులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో సీనియర్ అసిస్టెంట్లను కొనసాగించాలి

కొణిజర్ల: తెలంగాణ మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కమ్ డిప్యూటీ వార్డెన్ల సేవలను వేసవి సెలవుల కారణంగా తొలగించడం సరికాదని, వారిని యధావిధిగా కొనసాగించాలని డిప్యూటీ వార్డెన్ల సంఘం నాయకులు యాకూబ్ పాషా శనివారం ప్రభుత్వాన్ని కోరారు. విద్యాసంస్థలలో తరగతులు జరిగినన్ని రోజులు డిప్యూటీ వార్డెన్లు ఎన్నో వ్యయ ప్రయాశల కోర్చి బాధ్యతలు నిర్వహిస్తున్నామని జూనియర్ అసిస్టెంట్లను కొనసాగిస్తూ డిప్యూటీ వార్డెన్లను తొలగించడం సరికాదన్నారు. రాజకీయ మేధావులు, ప్రజా ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, ముస్లిం మైనార్టీ సంఘాలు, ముస్లిం మత పెద్దలు, వక్ఫ్‌బోర్డు పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు జరగుతున్న అన్యాయాన్ని గుర్తించి డిప్యూటీ వార్డెన్లకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ గురుకులాల సీనియర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా కమలాకర్‌రావు



కమలాకర్‌రావు

పెనుబల్లి: పెనుబల్లి మండల గౌడ సంఘ అధ్యక్షుడిగా మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఈడా కమలాకర్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం వీయంబంజర్‌లోని వంగా దామోదర్ ఇంటి వద్ద జరిగిన పెనుబల్లి మండల గౌడ నాయకుల సమావేశంలో కమలాకర్‌రావును మండల అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షులుగా కృష్ణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, కేశవులు, వెంకటేశ్వరరావు, రాజా, జనరల్ సెక్రటరీలుగా కనకారావు, తిరుపతిరావు, ట్రెజరర్‌గా నరసింహాస్వామి, జాయింట్ ట్రెజరర్‌గా తిరుపతయ్య, అమరనాధ్ గౌడ్, సతీష్, పెద్ద బాబురావు, వెంకటస్వామి, రాములు, శ్రీనివాసరావు, పీఆర్‌వోలుగా నాగేశ్వరరావు, షణ్ముఖ, రవీంద్రనాథ్ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోప జిల్లా ఉపాధ్యక్షుడిగా దామోదర్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పలువురిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు రమేష్, వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

మాజీ ఉప ప్రధాని, సంఘ సంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ప్రభుత్వ, ప్రైవేట్, పార్టీ కార్యాలయాల్లో అధికారులు, నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిమ్నవర్గాల నుంచి ఉన్నత స్థానాలను అధిరోహించిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని పలువురు ఆయన సేవలను కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



వైరా: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



బోనకల్: తహసీల్‌లో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ చందర్, సిబ్బంది



కారేపల్లిలో..



సత్తుపల్లిరూరల్: నివాళులర్పిస్తున్న బెటాలియన్ కమాండెంట్ పెద్దబాబు



ఎర్రుపాలెం: పెగళ్ళపాడులో..

క్రైం కార్నర్

కుప్పెనకుంట్లలో చోరీ



బీరువా లాకర్ తెరిచి ఉన్న దృశ్యం

పెనుబల్లి: మండలంలోని కుప్పెనకుంట్లలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కుప్పెనకుంట్ల గ్రామానికి చెందిన రైతు వేమిరెడ్డి నారాయణరెడ్డి ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి వసారాలో పడుకున్నారు. శనివారం ఉదయం లేచే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో భయంతో ఇంట్లోకి వెళ్లి చూడగా దుండగులు బీరువా లాకరు పగుల గొట్టి నాన్ తాడు, చంద్రహారం, ఉంగరాలు, నల్ల పూసల తాడు, చెవి దిద్దులు, ఇంతర బంగారు ఆభరణాలు సుమారు 13 కాసులు చోరీకి గురయ్యాయి. వాటి విలువ రూ. 6.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ చోరిపై బాధితులు వీయంబంజర్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన గోబోజి రవి, పరిటాల వెంకటనారాయణ, గోపి, చిర్ర వీరబాబు ఇరువర్గాల వారిపై శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరిటాల వెంకటనారాయణ తల్లి కోటమ్మ వద్ద గోబోజి రవి డబ్బులు వడ్డీకి అప్పుగా తీసుకున్నాడు. అయితే వడ్డీ అడిగేందుకు వెళ్లిన గోపి, వెంకటనారాయణ, వీరబాబులపై.. గోపి గోడవ పడ్డాడు. దీంతో ఇరువర్గాలు కొట్టుకోవడంతో తలకు గాయాలైయ్యాయి.

ఈ మేరకు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టగా.. వీరబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవిపై ఎస్సై నాగులుమీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సత్తుపల్లిటౌన్: ముస్తాబైన శ్రీకోదండ రామాలయం

రామాలయాలు ముస్తాబు

శ్రీరామనవమి పర్వదినం కోసం గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలను మామిడితోరణాలు, విద్యుత్ దీపాలతో ఆలయ కమిటీ నిర్వాహకులు ముస్తాబు చేశారు. శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించేందుకు ఆలయ ప్రాంగణాలలో ప్రత్యేక షామియానాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



తల్లాడ: పినపాకలో కోదండ రామాలయం



ముదిగొండ: ముత్తారంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవాలయం



ఏన్కూరులో..

సన్నబియ్యం పథకం పేదలకు వరం



చింతకాని: నాగులవంచలో పథకాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ అనంతరాజు

చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం పేదలకు వరమని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు తెలిపారు. మండలంలోని నాగులవంచ గ్రామంలోని రేషన్ దుకాణంలో శనివారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పేదల కోసం ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యాన్ని అందించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, మధిర ఆత్మ కమిటీ డైరెక్టర్ కొప్పుల గోవిందరావు, నాయకులు వీరభద్రం, బస్వయ్య, నాగార్జున్, ప్రసాద్‌రావు, పిచ్చయ్య, వీరభద్రం, కొండలరావు, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పలావ్ అదిరింది..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సన్నబియ్యం పలావ్ రుచిచూసి అదిరింది అంటూ కితాబిచ్చారు. సత్తుపల్లి మండలం సత్యంపేటలో శనివారం సన్నబియ్యంతో బండారి వెంకటేష్ దంపతులు వండిన పలావ్ విందును అధికారులతో కలిసి రుచిచూశారు. సన్న బియ్యం పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్ననాగేశ్వరరావు, డాక్టర్ మట్టా దయానంద్, ఎండి కమల్‌పాషా, చల్లగుళ్ల నర్సింహారావు, తోట సుజలరాణి, ఒగ్గు భూపతిరెడ్డి, గిరిజనులు పాల్గొన్నారు.

రూ.30 వేల విలువైన చీరలు పంపిణీ

కల్లూరు: కల్లూరు విజ్ఞాన్ విద్యానికేతన్‌లో శనివారం రిటైర్డ్ ఉద్యోగి ఎస్‌కే అబ్దుల్ లతీఫ్ ఆధ్వర్యంలో ఎస్సై దిద్దుపుడి హారతి చేతుల మీదుగా నిరుపేద ముస్లింలకు రూ.36 వేల విలువైన చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై హారతి మాట్లాడుతూ.. పేదలకు సేవ చేయాలనే తపన ఉన్న లతీఫ్ నిరుపేద మహిళలకు, వృద్ధులకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ముందుగా విజ్ఞాన్ స్కూల్ యాజమాన్యం ఎస్సై హరితను శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్‌రావు, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ మండల అధ్యక్షుడు వేల్పుల కృష్ణయ్య, ఎస్‌డీ అమీరుద్దీన్, రిటైర్డ్ హెచ్‌ఎం కావేటి కృష్ణయ్య, విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ ఎస్‌కే ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు అందిస్తున్న ఎస్సై హారతి